క్లుప్తంగా

రైతు భరోసా జాబితా ప్రదర్శన


సచివాలయంలో జాబితాను ప్రదర్శిస్తున్న సర్పంచ్ శ్రీనివాసరావు

జంగారెడ్డిగూడెం రూరల్ : రైతుల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పరిపాలన చేస్తోందని సర్పంచ్ పోల్నాటి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని శ్రీనివాసపురం సచివాలయంలో రైతు భరోసా అర్హుల జాబితా, అనర్హుల జాబితాను సర్పంచ్ శ్రీనివాసరావు చేతుల మీదుగా ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల ద్వారా అందుతున్న సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఆలయానికి పంచలోహ శిఖరం బహూకరణ


ఆలయంలో దాత కుటుంబ సభ్యులను సన్మానిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం : విజయదుర్గ అమ్మవారి ఆలయానికి పంచలోహ శిఖరాన్ని దాతలు బహూకరించినట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు మారిశెట్టి రాధాకృష్ణ, ప్రధాన కార్యదర్శి మాడా రామ్మోహనరావు తెలిపారు. శనివారం దాత సత్యవరపు దుర్గకుమార్, సింధు దంపతులు అమ్మవారిని దర్శించుకుని, అనంతరం రూ. 25,116 విలువైన పంచలోహ శిఖరాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా దాత కుటుంబ సభ్యులను ఆలయ కమిటీ ఘనంగా సత్కరించింది. కార్యక్రమంలో గుడిమెట్ల యుగంధర్, చిన్ని రామ సత్యనారాయణ, యర్రం ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సన్మానం


విద్యార్థులను సన్మానించిన దృశ్యం

కొయ్యలగూడెం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు కార్పొరేట్ పాఠశాలల విద్యార్థులతో పోటీపడి మంచి మార్కులు సాధించడం అభినందనీయమని జిల్లా విద్యా, వైద్య స్టాండింగ్ కమిటీ సభ్యురాలు జెడ్పీటీసీ దాసరి శ్రీలక్ష్మి పేర్కొన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంఈఓ జె.సురేష్ బాబు ఆధ్వర్యంలో పదో తరగతి పరీక్ష ఫలితాలలో టాపర్స్‌గా నిలిచిన ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థులకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. పరింపూడి బాలికోన్నత పాఠశాలకు చెందిన మర్రిడి వీర ఐశ్వర్య (582), బయ్యన్నగూడెం జెడ్పీ హైస్కూల్‌కి చెందిన కస్సే రమ్య (574), పరింపూడి బాలికల హైస్కూల్‌కి చెందిన సంకు యజ్ఞశ్రీ రాఘవ (570) మార్కులు సాధించినందుకు అభినందించారు. విద్యార్థులకు శుభాకాంక్షలు తెలుపుతూ ఎంపీపీ గంజిమాల రామారావు రూ.పది వేలు, జెడ్పీటీసీ దాసరి శ్రీలక్ష్మి రూ.6 వేలు నగదు బహుమతులు అందజేశారు. ఎంపీడీవో కేఆర్ఎస్ కృష్ణప్రసాద్, వైస్ ఎంపీపీలు తుమ్మలపల్లి గంగరాజు, మట్టా వనజ లక్ష్మి, సర్పంచులు ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఉచిత కేన్సర్ స్క్రీనింగ్ శిబిరం

జంగారెడ్డిగూడెం రూరల్ : శ్రీనివాసపురంలో తానా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ కేన్సర్ స్క్రీనింగ్ శిబిరం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలు విభాగాలను జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, సర్పంచ్ పోల్నాటి శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకుని ఆరోగ్యంగా జీవించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ జుజ్జవరపు తాతారావు, వైఎస్సార్ సీపీ నాయకులు పోల్నాటి రాజా, పోల్నాటి నాని పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

పెదపాడు: మండలంలోని సమగ్ర శిశు అభివృద్ధి సేవా పథకంలో భాగంగా పెదపాడు అంగన్‌వాడీ కేంద్రంలో సహాయకురాళ్ల పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పెదపాడు ఐసీడీఎస్ సీడీపీవో కే విజయలక్ష్మి తెలిపారు. పెదపాడు ప్రాజెక్టు పరిధిలోని పెదవేగి మండలం కూచింపూడి ఓసీ, కొండలరావుపాలెం ఎస్ పెదపాడు-9, బీసీ-ఈ నాయుడుగూడెం బీసీ-డీ, జాలిపూడి-2 ఓసీ, మల్కాపురం-2 బీసీఏ అభ్యర్థులకు కేటాయించినట్లు చెప్పారు. 21 ఏళ్లు నిండి 35 సంవత్సరాలు లోపు వయస్సున్న పదో తరగతి పాసైన స్థానికులైన వివాహిత మహిళలు జూన్ నెల 2లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తుతో పాటు గెజిటెడ్ అధికారి అటెస్టేషన్ చేసిన ధ్రువ పత్రాలను జత చేయాలన్నారు. కులం, విద్యార్హతలు, పుట్టినతేదీ, అవసరమైన ధ్రువీకరణ పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని విజయలక్ష్మి కోరారు.

వలంటీర్ల సేవలు వెలకట్టలేనివి

- చింతలపూడి ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా
- కామవరపుకోటలో వలంటీర్లకు సత్కారం


ప్రశంసాపత్రాలు అందుకున్న వలంటీర్లతో ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా

కామవరపుకోట : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాల మేరకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేస్తున్న గ్రామ సచివాలయ వలంటీర్ల సేవలు వెలకట్టలేనివని చింతలపూడి ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా అన్నారు. స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో శనివారం వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా ఉత్తమ సేవలు అందించిన వలంటీర్లను సన్మానించి ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రజలకు నేరుగా సంక్షేమ పథకాలు అందించాలనే లక్ష్యంతో అనేక లక్షల మందికి ఉపాధి కల్పించి గ్రామ సచివాలయ వలంటరీ వ్యవస్థను తీసుకువచ్చారన్నారు. దేశంలో అనేక రాష్ట్రాలు వలంటరీ వ్యవస్థను ఆదర్శంగా తీసుకుని అమలు చేసే విధంగా ముందుకు వెళుతున్నాయన్నారు. సంక్షేమ పథకాలు అందించడంలో ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధులు వలంటీర్లే అని అన్నారు. గతంలో పింఛన్ తీసుకోవడానికి వృద్ధులు, వికలాంగులు ప్రభుత్వ కార్యాలయాలు చుట్టూ తిరిగి నానా ఇబ్బందులు ఎదుర్కొనేవారని, కానీ ఇప్పుడు వలంటీర్ల వ్యవస్థతో లబ్ధిదారుల ఇంటి వద్దనే 1వ తేదీ ఉదయమే పింఛన్ సొమ్ము అందుకుంటు ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఇది చూసి ఓర్వలేక టీడీపీ నాయకులు వలంటరీ వ్యవస్థను హేళన చేస్తున్నారని, వారికి ప్రజలు తగిన బుద్ధి చెబుతారన్నారు. ప్రతి వలంటీర్ మరింత బాధ్యతగా పనిచేస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి గురించి ప్రజలకు వివరించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కడిమి రమేష్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్లు మిడతా రమేష్ బాబు, నానాది సాగర్, రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ డైరెక్టర్ పండు జగదీష్, గ్రీవెన్స్ సెల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రామకృష్ణ, ఎంపీడీవో కె.శ్రీదేవి, తహసీల్దార్ డీవీ సత్యనారాయణ, ఈవోపీఆర్డీ ఈ.శ్రీనివాసరావు, తడికలపూడి సొసైటీ చైర్మన్ గుర్రాల రవికుమార్, ఎంపీటీసీలు బోల్లు వెంకట సత్యనారాయణ, తమ్మిశెట్టి గిరిజ, పోలిమెట్ల ప్రశాంత్ కుమార్, బూరుగు శ్రీను, కోఆప్షన్ సభ్యులు ఎస్.కె కరీముల్లా, గ్రామ సర్పంచ్‌లు కరిపోతు అనూష, దేవరపల్లి రామ్మోహన్‌రావు, వైఎస్సార్ సీపీ నాయకులు నాగళ్ళ సీతారాంబాబు, సాయిల స్వాతి, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి కుంకుళ్లమ్మ ఆలయ వార్షికోత్సవాలు



ద్వారకాతిరుమల: శ్రీవారి ఆలయానికి ఉపాలయమై, క్షేత్ర దేవతగా విరాజిల్లుతున్న శ్రీకుంకుళ్లమ్మ అమ్మవారి ఆలయ వార్షికోత్సవాలు ఈనెల 28 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించనున్నట్టు ఆలయ ఈఓ వేండ్ర త్రినాథరావు చెప్పారు. వేడుకల్లో భాగంగా 28న ఉదయం 9.30 గంటల నుంచి గణపతి పూజ, పుణ్యహవాచనం, రుత్విగ్వరణ, పంచగవ్య ప్రాశన, దీక్షాధారణ, అంకురార్పణ, అలాగే 29న ఉదయం 9 గంటల నుంచి గణపతి పూజ, సర్వతోభద్ర మండలి ఆరాధన, మూలమంత్ర అనుష్ఠానము, హోమాలు జరుగుతాయన్నారు. 30న ఉదయం 8 గంటల నుంచి మూలవరుల ఉత్సవమూర్తులకు నవకలశ స్నపన, శ్రీ చక్రార్చన, సప్తశతి పారాయణ, హోమాలు, పూర్ణాహుతితో ఈ వేడుకలు పరిసమాప్తం అవుతాయన్నారు. భక్తులు వేడుకల్లో పాల్గొని, అమ్మవారిని దర్శించి తీర్థప్రసాదాలను స్వీకరించాలని కోరారు.

నిర్వాసితులపై నిర్లక్ష్యం తగదు

కుకునూరు : పోలవరం నిర్వాసితులపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదని సీపీఎం నాయకులు పేర్కొన్నారు. శనివారం మాధవరంలో నిర్వహించిన సీపీఎం మండల కమిటీ సమావేశం మేడిపల్లి బాబు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రానికి జీవనాడిగా చెప్పబడుతున్న పోలవరం ప్రాజెక్ట్ కోసం తమ సర్వస్వాన్ని కోల్పోతున్న నిర్వాసితులకు పునరావాసం కల్పించకుండా, పరిహారం పూర్తి స్థాయిలో చెల్లించకుండా ప్రాజెక్ట్ నిర్మాణం చేపడుతున్నారన్నారు. గత ఏడాది వచ్చిన గోదావరి వరదలకు మండలం పూర్తిగా ముంపునకు గురై తీవ్ర నష్టం వాటిల్లిందని అయినా ప్రభుత్వం నిర్వాసితులను పట్టించుకోకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. మళ్లీ గోదావరి వరదల సమయం రావడంతో నిర్వాసితుల హక్కులు సాధించుకునేందుకు సీపీఎం ఆధ్వర్యంలో జూన్ 20 నుంచి మహా పాదయాత్ర చేపడుతున్నామని తెలిపారు. ఈ సమావేశంలో సీపీఎం నాయకులు కోటా రామలక్ష్మి, వై.సాయికిరణ్, పి.లక్ష్మయ్య, ఎస్.లక్ష్మణరావు, బి.శ్రీను, మోహనరావు, వలీ పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

బుట్టాయగూడెం(జీలుగుమిల్లి) : జీలుగుమిల్లి మండలం ములగలంపల్లి సమీపంలోని ఒక తోటలో పేకాట ఆడుతున్న శిబిరంపై దాడి చేసి ఏడుగురు వ్యక్తులను శనివారం అరెస్టు చేసినట్లు ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు. పేకాట ఆడుతున్నట్లు అందిన ఖచ్చితమైన సమాచారంతో దాడి చేసినట్లు చెప్పారు. అదుపులోకి తీసుకున్న వారి వద్ద రూ.17800 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళం


విరాళం బాండ్ పత్రాన్ని అందిస్తున్న దృశ్యం

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు గుంటూరు జిల్లా కొలనుకొండకు చెందిన సామల వెంకట్రావు, లక్ష్మి దంపతులు శనివారం రూ. 1,00,016 విరాళంగా అందజేశారు. ముందుగా వారు స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం ఈ విరాళాన్ని నిత్యాన్నదాన కార్యాలయంలో జమచేశారు. ఈ సందర్భంగా దాత దంపతులకు ఆలయ సూపరింటెండెంట్ రమణరాజు విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

ఆరో రోజుకు అమ్మవారి జాతర ఉత్సవాలు


పొంగుటూరులో గరగలు, కలశాలను ఊరేగిస్తున్న భక్తులు

కొయ్యలగూడెం : పొంగుటూరు గ్రామ దేవత శ్రీ గంగానమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు శనివారంతో ఆరవ రోజుకు చేరుకున్నాయి. గ్రామంలో బంధుమిత్రులతో లోగిళ్లు కళకళలాడుతుండగా అమ్మవారు ఇంటింటికి తిరుగుతూ భక్తులచే నీరాజనాలు అందుకుంటోంది. అమ్మవారి ప్రతిరూపాలుగా భావించే గరగలను, కలశాలను ఊరేగిస్తూ గ్రామస్తులు తమ మొక్కుబడులు తీర్చుకోవడంతోపాటు లోగిళ్లలో అమ్మవారికి పాన్పులు వేసి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. శనివారం రాత్రి డాన్స్ బేబీ డ్యాన్స్, సినీ మ్యూజికల్ నైట్ నిర్వహించారు.

ప్రజాభిమానమే జగన్‌కు శ్రీరామరక్ష


ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న చింతలపూడి ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా

జంగారెడ్డిగూడెం : ఎవరెన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా ప్రజాభిమానమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి శ్రీరామరక్ష అని, ఆయన వచ్చే ఎన్నికల్లో మరలా సీఎం అవడం ఖాయమని ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా ధీమా వ్యక్తం చేశారు. జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీ పరిధిలో శనివారం గడపగడపకు మన ప్రభుత్వం 147వ రోజు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఎలీజా మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నిత్యం ప్రజల మధ్యనే ఉంటూ వారి బాగోగులు తెలుసుకునేందుకు వివిధ కార్యక్రమాల ద్వారా ప్రజాప్రతినిధులను చేరువ చేస్తున్నారన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రతి ఇంటికి వెళుతుంటే ప్రజలు సాదర స్వాగతం పలుకుతున్నారన్నారు. ప్రభుత్వం అధికారంలో ఉండగా, ప్రజాప్రతినిధులుగా తాము ప్రజల ముందుగా ధైర్యంగా వెళ్లగలుగుతున్నామంటే అది సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనే కారణమన్నారు. నాలుగేళ్ల కాలంలో జగన్ పరిపాలనలో ప్రజలు ఎటువంటి ప్రగతిని, లబ్ధిని పొందారో ప్రజలే వివరిస్తూ , వారి ఆనందాన్ని తమతో పంచుకుంటున్నారన్నారు. అలాగే తాము సైతం వారి సలహాలు, సూచనలు అందుకుంటూ, ఇంకా ఎటువంటి సంక్షేమాన్ని ప్రజలు కోరుకుంటున్నారో తెలుసుకుంటూ ముందుకు సాగుతున్నామన్నారు. గడపగడపకు కార్యక్రమంలో వచ్చిన సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామన్నారు. రాబోయే 2024 ఎన్నికల్లో తిరిగి వైఎస్సార్ సీపీ అధికార పీఠం దక్కించుకుంటుందని, 175 సీట్లు సాధించడం నల్లేరుమీద నడకే అన్నారు. 25వ వార్డులో నిర్వహించిన కార్యక్రమంలో సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా సహాయం పొందిన ఓ లబ్ధిదారులు తన కుటుంబ పెద్దను కోల్పోకుండా కాపాడుకోగలిగామని ఆనందాన్ని పంచుకుంది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి, వైస్ చైర్మన్ ముప్పిడి అంజి, అచ్యుత రామయ్య, లోకారపు వెంకటేశ్వరరావు, దొందు మాధవ్, పార్టీ నాయకులు బత్తిన చిన్న, ఉగ్గం దుర్గాప్రసాద్, నేకూరి కిషోర్, కంచుమర్తి ప్రకాష్, జహీర్‌బేగ్, షేక్ అమీర్, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ అక్బర్, మున్సిపల్ కమిషనర్ పి.భవానీ ప్రసాద్, డీపీవో జగదీష్, మేనేజర్ రమణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి


ద్వారకాతిరుమల గ్రంథాలయంలో వేసవి శిక్షణా శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు


కొయ్యలగూడెం గ్రంథాలయంలో విద్యార్థులకు చదరంగంపై శిక్షణనిస్తున్న దృశ్యం

ద్వారకాతిరుమల : సమయాన్ని సద్వినియోగం చేసుకునే విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని గ్రంథాలయ అధికారిణి గుర్రం బంగారుపాప అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో జరుగుతున్న శిక్షణా శిబిరంలో భాగంగా శనివారం విద్యార్థులకు టైమ్ మేనేజ్‌మెంట్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బంగారుపాప మాట్లాడుతూ ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలను విద్యార్థులు వాయిదా వేయకుండా చదవాలని, అప్పుడే అనుకున్న లక్ష్యాన్ని సాధించగలరని సూచించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగిని ఎం.నాగజ్యోతి, గ్రంథాలయ సహాయకురాలు బట్టు మణి తదితరులున్నారు.

చదరంగంపై శిక్షణ

కొయ్యలగూడెం : శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాలు 20వ రోజుకు చేరుకున్నాయి. శనివారం లైబ్రేరియన్ యు.రాముడు ఆధ్వర్యంలో విద్యార్థులకు చదరంగంపై మెలకువల గురించి వివరించారు. ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్రస్థాయి చదరంగ క్రీడాకారుడు ఎస్‌బీజీ శేఖర్ చదరంగం క్రీడలో ఉన్న మెలకువలు నేర్పారు. మెదడుకు పదును పెట్టడంలో చదరంగం విశేష పాత్ర నిర్వహిస్తుందని, విద్యార్థులు చదువులో రాణించడానికి చదరంగం క్రీడ దోహదపడుతుందని శేఖర్ పేర్కొన్నారు.

మానవత నూతన కార్యవర్గం ఎన్నిక


సమావేశంలో సేవా కార్యక్రమాలను వివరిస్తున్న దృశ్యం

చింతలపూడి : మానవత ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు సంస్థ మండల అధ్యక్షుడు కె.నాగ చిన్నారావు అన్నారు. స్థానిక మండల విద్యా వనరుల కేంద్రంలో శనివారం చిన్నారావు అధ్యక్షతన మానవత కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మానవత సంస్థ ద్వారా చేపడుతున్న సేవా కార్యక్రమాలపై సమీక్షించారు. భవిష్యత్తులో సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించాలని తీర్మానించారు. అనంతరం చింతలపూడి శాఖ అధ్యక్షునిగా యర్రగుంటపల్లికి చెందిన పుల్లారి సోమశేఖరాచార్యులుతో పాటు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సమావేశంలో డా.ఎ సత్యన్నారాయణ, ఆర్నేపల్లి అప్పారావు, ముప్పిడి శామ్యూల్, అన్నవరపు రాజారావు, బీవీఎస్ఎన్ రాజు, మన్యం సత్యకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పారిజాతగిరి వేంకటేశ్వరునికి ప్రత్యేక పూజలు

జంగారెడ్డిగూడెం : గోకుల తిరుమల పారిజాతగిరి శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుప్రభాతసేవ, ఆరాధన, తోమాలసేవ, తీర్థప్రసాదాగోష్టి అనంతరం స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. ధర్మాజీగూడెంకు చెందిన గ్రామస్తులు వందలాది మంది కాలినడకన వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. వీరికి ప్రత్యేకదర్శనాలు, పూజలు, అన్నప్రసాదవితరణ నిర్వహించినట్లు ఈవో మానికల రాంబాబు తెలిపారు. కాగా పారిజాతగిరిలో శ్రీ అభయాంజనేయస్వామి వారి 36 అడుగుల విగ్రహ ఏర్పాటుకు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, దాత కానూరు శ్రీనివాసరావు కుటుంబ సభ్యులు శంకుస్థాపన చేసినట్లు ఈవో తెలిపారు. ఆలయ ప్రధానార్చకులు నల్లూరు రవికుమారాచార్యులు శంకుస్థాపన పూజలు చేయించారు. దాతలకు స్వామి వారి శేషవస్త్రాలు, ప్రసాదాలు వేద పండితుల ఆశీస్సులతో అందించారు. అన్నదాతలుగా కె.శ్రీనివాసరావు, వరలక్ష్మి దంపతులు వ్యవహరించారు. పి.జగపతిరాజు, దండు ధనరాజు, కంది బాలకృష్ణారెడ్డి, రెడ్డి రంగప్రసాద్, వాసవి శాయి నగేష్ పాల్గొన్నారు.

క్రీడలపై ఆసక్తిని పెంచుకోవాలి


యువకులకు వాలీబాల్ కిట్‌ను అందజేస్తున్న ఎస్సై పవన్‌కుమార్

పోలవరం రూరల్ : యువత చెడు వ్యసనాలకు లోనుకాకుండా క్రీడలపై ఆసక్తి పెంచుకుని మంచి క్రీడాకారులుగా రాణించాలని, అలాగే విద్యపై కూడా శ్రద్ధ చూపాలని, పోలవరం ఎస్సై ఎస్ఎస్ పవన్‌కుమార్ అన్నారు. శనివారం పోలవరం పంచాయతీ పరిధిలోని కమ్మరగూడానికి చెందిన యువకులకు వాలీబాల్ నెట్, బాల్‌ను బహూకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువకులు చెడు అలవాట్లకు లోనుకావడంతో తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారన్నారు. ఆటలు ఆడితే దేహధారుఢ్యం పెరగడతో పాటు ఆరోగ్యంగా ఉంటారన్నారు. ప్రతి యువకుడు క్రమశిక్షణతో బాధ్యతగా ఉండాలన్నారు. యువత దేశ ప్రగతిలో భాగస్వాములు కావాలని వైఎస్సార్ సీపీ నాయకులు సొబ్బన మోహన్ అన్నారు. ఈ కార్యక్రమంలో సొబ్బన రాజశేఖర్‌బాబు, పోలీసు సిబ్బంది, యువకులు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం రోటరీ సేవలు ఆదర్శనీయం


కాసర నర్సిరెడ్డికి రోటరీ జీవన సాఫల్య పురస్కారం అందజేస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం : సమాజహితం కోసం జంగారెడ్డిగూడెం రోటరీ క్లబ్ చేస్తున్న సేవలు ఆదర్శనీయం అని రోటరీ జిల్లా 3020 గవర్నర్ విశ్వనాధం భాస్కరరాం అన్నారు. రోటరీ కార్యదర్శి వూడా రాంగోపాల్(గోపీ) అధ్యక్షతన స్థానిక శ్రీమల్లాది సీతారామలింగేశ్వర రావు రోటరీ కమ్యూనిటీ హాల్‌లో శుక్రవారం సాయంత్రం రోటరీ జిల్లా గవర్నర్ అధికారిక పర్యటన కార్యక్రమం, సమావేశం నిర్వహించింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న విశ్వనాధం భాస్కర రాం మాట్లాడుతూ దాకారపు కృష్ణ రోటరీ పటిష్ట నాయకత్వం, పారదర్శక కార్యాచరణ భవిష్యత్తులో రోటరీకి యువశక్తి అందగలదని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. కాగా దాకారపు కృష్ణ ద్వారా అందుకున్న విజ్ఞప్తి మేరకు లక్కవరం శ్మశానవాటిక అభివృద్ధికి తమ వ్యక్తిగత నిధుల నుంచి రూ. 3లక్షలు అందిస్తామని, పనిప్రగతి పరిశీలించి మరో లక్ష కూడా వ్యక్తిగత నిధుల నుంచి అందిస్తానని భాస్కరరాం ప్రకటించారు. అసిస్టెంట్ గవర్నర్ మద్దు గోపాలకృష్ణ మాట్లాడుతూ జంగారెడ్డిగూడెం, కొయ్యలగూడెం క్లబ్‌లు కలిసి ఆరు సమావేశాలు ఏర్పాటు చేసుకోవడం 22-23 ప్రత్యేకతల్లో ఒకటని, ఈ దిశగా దాకారపు కృష్ణ చొరవను ప్రస్తావించి ప్రశంసించారు. అధ్యక్షులు దాకారపు కృష్ణ, కార్యదర్శి ఉడా రాంగోపాల్ రోటరీ ప్రగతిని వివరించారు. అనంతరం రోటరీ ఓకేషనల్ ఎక్సలెన్సీ పురస్కారాల్లో భాగంగా జీవన సాఫల్య పురస్కారాన్ని కళారంగంలో విశేష సేవలు అందిస్తున్న కె ఎస్ ఆర్ ట్రస్ట్ వ్యవస్థాపకులు కాసర నర్సిరెడ్డికి అందజేశారు. అనంతరం వివిధ రంగాల్లో సమాజానికి విశేష సేవలు అందిస్తున్న మరో 14 మందికి పురస్కారాలు అందజేశారు. ఇటీవల రోటరీ నిర్వహించిన యువజనోత్సవాల విజేతలకు రోటరీ గవర్నర్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో రోటరీ చార్టర్ సభ్యులు చామర్తి శ్రీరాములు, ఎంఎస్ఆర్, గణిత ఆనంద ప్రసాద్, వెలివెల పెద్దిరాజు, అయినపర్తి చంద్రశేఖర్, కొమ్ముకూరి నాగేశ్వరరావు, రొంగల దేవీప్రసాద్, బవిరిశెట్టి హనుమాన్ తిలక్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీలో రూ.15.54 కోట్ల పనులు

చింతలపూడి : మండలంలోని 19 గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులపై శనివారం ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా 22-23 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన పనులపై ప్రజా వేదిక నిర్వహించారు. ఈ నెల 17వ తేదీ నుంచి 26వ తేదీ వరకు సామాజిక తనిఖీ బృందం గ్రామ సభలు నిర్వహించి ఉపాధి పనులపై తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా డ్వామా పీడీ రాము మాట్లాడుతూ మండలంలో ఉపాధి హామీ పథకంలో 1,084 పనులు, పంచాయతీరాజ్ శాఖలో 66 పనులు, గ్రామీణ నీటిపారుదల శాఖలో 5 పనులు, సర్వశిక్షా అభియాన్‌లో 3 పనులు కలిపి మొత్తం 1,160 పనులు ఈ ఏడాది చేసినట్లు తెలిపారు. మొత్తం రూ.15.54 కోట్లు ఖర్చు చేసినట్లు చెప్పారు. ఈ పనుల నిమిత్తం కూలీలకు వేతనంగా రూ.12,55,65,964 చెల్లించారన్నారు. అదే విధంగా మెటీరియల్ నిమిత్తం రూ.2,98,62,210 ఖర్చు పెట్టినట్లు చెప్పారు. పంచాయతీరాజ్ విభాగంలో రోడ్లు, డ్రెయిన్లు నిర్మించామన్నారు. గృహనిర్మాణ శాఖలో 90 రోజుల పనిదినాలు కల్పించామన్నారు. పండ్ల తోటల రైతులకు కూడా ఉపాధిహామీ పథకంలో అనేక రాయితీలు కల్పిస్తున్నట్లు చెప్పారు. ప్రజాప్రతినిధులు ఉపాధి హామీలో భాగస్వాములై గ్రామాలకు అవసరమైన పనులు గుర్తించాలని కోరారు. సామాజిక తనిఖీలో భాగంగా రూ.23,998 రికవరీ చేయమని ఆదేశించినట్లు తెలిపారు. సరైన నిర్వహణ చేయని ఫీల్డ్ అసిస్టెంట్‌లకు రూ.5 వేల జరిమానా విధించామన్నారు. రూ.1,88,308 పనులకు సంబంధించి అవకతవకలను గుర్తించామన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ రవి కుమార్, డీజీఓ విజయలక్ష్మి, ఏపీడీ పురుషోత్తం, ఎస్ఆర్పీ రామచంద్రరావు, ఎంపీడీఓ మణికుమారి, ఏపీఓ మోహినీ కుమారి పాల్గొన్నారు.

శ్రీవారి క్షేత్రంలో పోటెత్తిన భక్తులు



ద్వారకాతిరుమల: శ్రీవారి దివ్య క్షేత్రం శనివారం భక్తజన సంద్రమైంది. స్వామివారికి ప్రీతికరమైన రోజు, వేసవి సెలవులు కావడంతో వేలాది మంది భక్తులు ఆలయానికి తరలివచ్చారు. తెల్లవారుజాము నుంచే భక్తుల రాక ప్రారంభం కావడంతో క్షేత్ర పరిసరాలు సందడిగా మారాయి. వైకుంఠం క్యూకాంప్లెక్స్, దర్శనం క్యూలైన్లు, అనివేటి మండపం, తూర్పురాజగోపుర ప్రాంతాలతో పాటు, కేశఖండనశాల ఇతర విభాగాలు భక్తులతో కిక్కిరిశాయి. ఆలయ అనివేటి మండపంలో తిరుమల తిరుపతి దాససాహిత్యా ప్రాజెక్టుకు చెందిన పలు భజన మండలి సభ్యులు ప్రదర్శించిన కోలాట నృత్యాలు ఆకట్టుకున్నాయి. వేసవి ఎండ తీవ్రత దృష్ట్యా దేవస్థానం అధికారులు, సిబ్బంది వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లో భక్తులకు మజ్జిగను పంపిణీ చేశారు. క్షేత్రంలో సాయంత్రం వరకు భక్తుల రద్దీ కొనసాగింది.

రేపు గోవిందానంద సరస్వతి స్వామీజీ రాక

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ద్వారక, బదరి పీఠాధిపతి స్వరూపానంద సరస్వతి స్వామీజీ శిష్యులు గోవిందానంద సరస్వతి స్వామీజీ ఈనెల 29న ఏలూరు నగరానికి విచ్చేయనున్నారని కంచికామకోటి హేలాపురి సంస్కృతవేద స్మార్త ప్రయోగ పాఠశాల అధ్యక్షుడు ఈదర వేంకట రమణ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 8 గంటలకు నగరంలోని పవర్‌పేట చదలవాడ వారి వీధిలో ఉన్న సంస్కృత పాఠశాలకు స్వామీజీ విచ్చేస్తారని, ఉదయం 11 గంటలకు భక్తులనుద్దేశించి అనుగ్రహ భాషణం చేస్తారని పేర్కొన్నారు. అనంతరం మధ్యాహ్నం ఇక్కడి నుంచి బయలుదేరి తాడేపల్లిగూడెంకు పయనమౌతారని తెలిపారు. కార్యక్రమాల్లో భక్తులంతా పాల్గొని స్వామీజీ అనుగ్రహానికి పాత్రులు కావాలని కోరారు.

కౌలురైతులకు సీసీఆర్‌సీ కార్డులు అందించాలి

ఉంగుటూరు: వ్యవసాయ సీజన్ వచ్చే సరికి కౌలురైతులందరికీ పంట సాగు హక్కు పత్రాలు ఇవ్వాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె. శ్రీనివాసరావు అన్నారు. శనివారం ఉంగుటూరు పంచాయతీ సామాజిక భవనంలో ఏపీ రైతు సంఘం, కౌలు రైతు సంఘం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కౌలు రైతులకు, రైతులకు ధాన్యం బకాయిలు వెంటనే చెల్లించాలని సమావేశంలో కోరారు.